సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 18 । ఆగస్టు । 2023



టన్ను చీనీ రూ.18,500
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18,500 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



కిలో టమాటా @రూ.37
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్ట ధర రూ.37 మేర పలికింది. మార్కెట్‌కు 3,600 టన్నులు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
36.2°/21.6°
జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఫార్మా డీ ఇంటర్న్‌షిప్ అసెస్‌మెంట్ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో నిర్వహించిన ఫార్మా డీ ఇంటర్న్‌షిప్ అసెస్‌మెంట్ ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి గురువారం తెలిపారు. ఫలితాలను http://jntuaresults.ac.in వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

నవోదయ ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు



లేపాక్షి: లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ ఎం.నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎస్పీని కలిసిన ఎస్‌ఐలు



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెంకటరమణ

పుట్టపర్తి టౌన్: జిల్లా పరిధిలో వివిధ పోలీస్టేషన్లలో ఎస్‌ఐలుగా పనిచేస్తూ సీఐలుగా పదోన్నతి పొందిన వారు ఎస్పీ మాధవ రెడ్డిని కలిశారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో వెంకటహర్ష, వెంకటరమణ, హేమంత్‌కుమార్ ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఎస్పీ అభినందించారు. ఏ ప్రాంతంలో పనిచేసినా అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు.

మారుమూలలకూ 'ఫ్యామిలీ డాక్టర్'



నులిపురుగుల నివారణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి

అమడగూరు: మారుమూల ఉన్న ప్రతి గ్రామానికీ ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన ఓడీ చెరువు మండలంలోని గాజుకుంటపల్లి, కొండకమర్ల గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ ఫిజీషియన్ అమలు విధానాన్ని పరిశీలించారు. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా చిత్తశుద్ధి, అంకితభావం, సేవాభావంతో పని చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం కొండకమర్లలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆరోగ్య అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు భానుప్రకాష్, కమల్ రోహిత్, కమ్యూనిటీ హెల్త్ అధికారి సుభాషిణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చిరుతకు కాలగండం

- ఉమ్మడి జిల్లాలో వరుసగా మృత్యువాత
- నైరుతి రుతుపవనాల కాలంలో కలయిక కోసం పరిధి దాటుతున్న వన్యప్రాణి
- ఈ క్రమంలో ఆడా, మగ జీవుల మధ్య ఘర్షణ
- అరుదైన మృగాల మృతితో అంతటా కలవరం



చిరుత కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు



సాక్షి ప్రతినిధి,అనంతపురం: మడకశిర మండలంలోని మెళవాయి సమీపంలో రెండు రోజుల క్రితం (బుధవారం) ఒక ఆడ చిరుత మృతి చెందింది. గురువారం కూడా అదే ప్రాంతంలోనే మరో మగ చిరుత మృతి చెందింది. ఈ రెండు చిరుతలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాయి. కారణాలు అంతుచిక్కడం లేదు. విషాహారం తినడంతో మృతి చెందాయా? అనారోగ్యం బారిన పడి మృతి చెందాయా? లేదా వేటగాళ్ల దాడిలో మృతి చెందాయా? అనే కోణాల్లో అటవీశాఖ అధికారులు విచారణ చేస్తున్నారు.

తల్లీపిల్లని అనుమానం

మృతి చెందిన రెండు చిరుతలు తల్లి, పిల్లగా అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. బుధవారం మృతి చెందిన ఆడ చిరుతకు దాదాపు 32 నెలల వయసు ఉంటుందని చెబుతున్నారు. గురువారం మృతి చెందిన మగ చిరుతకు 18 నెలల వయసు ఉంటుందంటున్నారు. ఈ నేపథ్యంలో మృతి చెందిన చిరుతలు తల్లి , పిల్లగా భావిస్తున్నారు. మగ చిరుతకు ఇంకా పాల పళ్లు అలాగే ఉన్నట్లు తెలిసింది.

రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వరుసగా చిరుతపులులు మృత్యువాత పడుతుండటం విస్మయం కలిగిస్తోంది. మడకశిర నియోజకవర్గంలో రెండు రోజుల్లోనే రెండు చిరుతలు మృతి చెందిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సరిగ్గా ఏడాదిన్నర క్రితం కూడా పెనుకొండ నియోజకవర్గంలో రెండు చిరుతలు మృతి చెందాయి. ఆరు నెలల క్రితం బెంగుళూరు జాతీయ రహదారిపై సోమందేపల్లి వద్ద వాహనం ఢీకొనడంతో ఒకటి ప్రాణాలు కోల్పోయింది. వరుసగా ఇలా అరుదైన వన్య సంపద నష్టపోతుండడంతో ఫారెస్టు అధికారుల్లోనూ ఆందోళన మొదలైంది.

కాటేస్తున్న కాలం!

సాధారణంగా చిరుతకు పరిధి ఉంటుంది. ఆ ప్రాంతంలోకి మరొక చిరుతను రానివ్వదు. అయితే, ఆగస్టు నుంచి నవంబర్ మాసాల మధ్య కాలంలో కలయిక కోసం అవి పరిధి దాటుతూ ఉంటాయి. ఈ సమయంలోనే వాటి మధ్య తీవ్ర ఘర్షణ జరుగుతుంది. ఒక్కోసారి ఆడ, మగ చిరుతలు కూడా ఘర్షణ పడుతూ ఉంటాయి. ఈ కారణంగా చిరుతలు ప్రాణాలు కోల్పోతాయని అధికారుల చెబుతున్నారు. ఒక్కోసారి బలమైన దుప్పులను వేటాడుతున్నప్పుడు వాటి కొమ్ములు తగిలి గాయాలపాలై కన్నుమూస్తామని పేర్కొంటున్నారు.

రాయలసీమలో ఇక్కడే అనుకూలం..

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో చిరుతల సంతానోత్పత్తి బాగా జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. వీటితో పాటు జింకలు, నెమళ్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగినట్టు ఫారెస్టు అధికారుల పరిశీలనలో వెల్లడైంది. ఇదే సమయంలో చిరుతలు మృతి చెందుతుండటం కలవరపరుస్తోంది. రాత్రిళ్లలో జాతీయ రహదారిపైకి వచ్చినప్పుడు వాహనాల హెడ్‌లైట్ ఫోకస్‌కు ఆగిపోవడం, అవి ఢీకొట్టి చనిపోయిన ఘటనలూ చోటు చేసుకుంటున్నాయి. రాయలసీమలోనే చిరుతలకు అనుకూలమైన ప్రాంతంగా ఉమ్మడి జిల్లా అడవులు పేరుపొందాయి. దీంతో వన్యప్రాణుల సంతతి పెరుగుతోందని భావిస్తున్న తరుణంలో ఒక్కో వన్యమృగం మృతి చెందుతూ ఉండడం కలకలం రేపుతోంది.

విషం ఆనవాళ్లు

మృతి చెందిన రెండు చిరుతలకు మడకశిరలోని వెటర్నరీ ఆస్పత్రిలో డాక్టర్లు పోస్టుమార్టం నిర్వహించారు. రెండు చిరుతల శరీరంలో విషం ఆనవాళ్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ చిరుతలకు శరీరంపై ఎలాంటి గాయాలు కూడా లేవు. అలాగే ఎలాంటి ఆరోగ్య సమస్యలు కూడా లేవని డాక్టర్లు గుర్తించినట్లు సమాచారం. దీంతో విష ఆహార తినడంతోనే చిరుతలు మృతి చెందినట్లు డాక్టర్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిసింది. అయితే పూర్తిస్థాయిలో చిరుతల మృతిని నిర్ధారించడానికి చిరుతల శరీర నమూనాలను బెంగళూరు ల్యాబ్‌కు పంపారు. వారంలోగా ల్యాబ్ నివేదిక వచ్చే అవకాశం ఉంది. అప్పుడే చిరుతల మృతికి స్పష్టమైన కారణం తెలుస్తుంది.

చిరుతలు పరిధి దాటే కాలమిది



సాధారణంగా నైరుతి రుతుపవనాల కాలంలో చిరుతలు ఒకదానితో ఒకటి కలుస్తుంటాయి. దీంతో తమ పరిధి దాటి వెళతాయి. ఒకదాని పరిధిలోకి మరొక చిరుత వెళితే బాగా గొడవ పడి వాటికవే శత్రువులుగా మారి చంపేసుకుంటాయి. అందుకే ఈ సమయంలో అటవీ ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలను అడవుల్లోకి వెళ్లకూడదని హెచ్చరిస్తుంటాం. – సందీప్ కృపాకర్, జిల్లా ఫారెస్టు అధికారి, అనంతపురం

బెంగళూరు లేబొరేటరీకి నమూనాలు



మృతిచెందిన రెండు చిరుతలకు పోస్టుమార్టం నిర్వహించాం. రెండింటి శరీరాలపై ఎలాంటి గాయాలూ లేవు. అందుకే నమూనాలను బెంగళూరులోని వెటర్నరీ లేబొరేటరీకి పంపిస్తున్నాం. ఆ ప్రక్రియ పూర్తయితే గానీ వీటి మృతికి కారణమేమనేది చెప్పలేం.

– డా.అమర్, పశువైద్యాధికారి, మడకశిర

భయం గుప్పిట్లో జనం

మడకశిర/మడకశిరరూరల్: మడకశిర ప్రాంతంలో చిరుతల సంచారం అధికంగా ఉండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మెళవాయి గ్రామ సమీపంలో రెండు చిరుతలు మృతి చెందిన నేపథ్యంలో చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు బయటికి వెళ్లడానికి కూడా భయపడుతున్నారు. ముఖ్యంగా చిరుతలు మృతి చెందిన సమీపంలోనే దట్టమైన భూతప్ప కనుమ అటవీ ప్రాంతం ఉంది. ఈ అటవీ ప్రాంతంలో చిరుతల కదలికలు అధికంగానే ఉన్నాయి. వివిధ గ్రామాల ప్రజలు తమ పశువులను మేత కోసం ఈ అటవీ ప్రాంతానికి తీసుకెళ్తారు. దీంతో ఎటువైను నుంచి ఏ చిరుత దాడి చేస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

విషం ఆనవాళ్లు

మృతి చెందిన రెండు చిరుతల శరీరంలో విషం ఆనవాళ్లు ఉన్నట్లు పోస్టుమార్టంలో ప్రాథమికంగా బయటపడింది. అయితే చిరుతలు ఏకారణంతో చనిపోయాయో పూర్తి స్థాయిలో నిర్ధారించడానికి శరీర శాంపిల్స్‌ను బెంగళూరులోని ల్యాబ్‌కు పంపుతున్నాం. ఇక నుంచి చిరుతలు మృత్యువాత పడకుండా చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాసరెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, పెనుకొండ

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మెళవాయి సమీపంలోని కాకుల కొండ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఈ కొండలోనే రెండు చిరుతలు మృతి చెందాయి. మగ చిరుత కూడా ఉండే అవకాశం ఉంది. గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సాయంత్రం సమయంలో కొండ ప్రాంతానికి వచ్చేవారు మరింతగా అప్రమత్తంగా ఉండాలి. గ్రామాల్లో ప్రజలకు అటవీశాఖ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపడతాం.
– రవీంద్రరెడ్డి, అటవీశాఖ అధికారి

గ్రూప్–1లో మెరిసిన జిల్లావాసులు

- రెండో ర్యాంకుతో సత్తా చాటిన భూమిరెడ్డి భవాని
- ప్రవీణ్ కుమార్ రెడ్డికి రాష్ట్ర స్థాయి నాలుగో ర్యాంకు
- ఫలితాల్లో ప్రతిభ చాటిన ఎస్కేయూ పరిశోధన విద్యార్థి
- తలుపుల వాసి భవాని డీఎస్పీగా ఎంపిక

అనంతపురం: ఏపీపీఎస్సీ గ్రూప్-1 ఫలితాల్లో జిల్లా వాసులు సత్తా చాటారు. గురువారం విడుదలైన ఈ ఫలితాల్లో జిల్లాకు చెందిన భూమి రెడ్డి భవానీ రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకుతో మెరిశారు. జేఎన్‌టీయూ అనంతపురంలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన కే. ప్రవీణ్ కుమార్ రెడ్డి రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంకు దక్కించుకుని పలువురితో శభాష్ అనిపించుకున్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని గ్రామీణాభివృద్ధి విభాగంలో పరిశోధన చేస్తున్న దానం జ్ఞానానంద రెడ్డి గ్రూప్-1లో ర్యాంకు సాధించి అసిస్టెంట్ కమిషనర్ స్టేట్ ట్యాక్స్ (గతంలో సీటీఓ) ఉద్యోగం దక్కించుకున్నారు. అలాగే బెళుగుప్ప ఎంపీడీఓ గాజుల శ్రీరాములు రామచంద్ర, లక్ష్మి కుమారుడు గాజుల రామచంద్రవరుణ్ గ్రూప్-1 ఫలితాల్లో సత్తాచాటి ఎంపీడీఓగా ఎంపికయ్యారు.

ఇకపై డీఎస్పీ భవాని



కదిరి: తలుపుల మండలం గంజివారిపల్లికి చెందిన టి.భవాని డీఎస్పీగా ఎంపికయ్యారు. ఏపీపీఎస్సీ గురువారం గ్రూప్-1 ఫలితాలు విడుదల చేసింది. భవాని ప్రస్తుతం వైఎస్సార్ జిల్లా చాపాడు మండలంలో డిప్యూటి తహసీల్దార్‌గా పని చేస్తున్నారు. అంతకు మునుపు గ్రూప్-2లో ఎంపికై వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో కూడా పని చేశారు. భవాని భర్త విశ్వనాథ్ వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్లలోని రాయలసీమ థర్మల్ విద్యుత్ ఉత్పాదన సంస్థలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. తల్లి కె.తులసి గృహిణి కాగా తండ్రి చెన్నకృష్ణ కదిరిలో ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. తమ కుమార్తె డీఎస్పీగా ఎంపిక కావడం పట్ల ఆమె తల్లిదండ్రులు సంతోషం వెలిబుచ్చారు. ఆమెను స్వగ్రామానికి చెందిన వీఆర్‌ఓ నరసింహారెడ్డి, మరికొందరు అభినందించారు.

నాన్నకు అంకితం

- జ్ఞానానందరెడ్డి, గ్రూప్–1 ర్యాంకర్



ఈ విజయం మా నాన్న పెద్దిరెడ్డికి అంకితం. నాన్న వీఆర్వోగా పనిచేస్తున్న సమయంలోనే గ్రూప్-1 సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా. శ్రీ సత్యసాయి జిల్లా ఎన్‌పీ కుంట మండలం, మద్రికొమ్మ దిన్నె మా స్వగ్రామం. అమ్మ అరుణ కుమారి అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నారు. గ్రూప్-1 అధికారి కావాలనే నాన్న కల నన్ను ఇంత వరకు నడిపించింది. కానీ గ్రూప్-1 కల నెరవేరే సమయానికి మా నాన్న లేరనే బాధ ఉంది. నా భార్య రవళి గ్రూప్-1కు సన్నద్ధమవుతున్నారు. ఎస్కేయూలో రూరల్ డెవలప్‌మెంట్ విభాగంలో పీహెచ్‌డీ అడ్మిషన్ పొందడమే నాకు జీవితంలో ఒక మలుపు లాంటిది. అక్కడ పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే అభ్యర్థులే నాకు స్ఫూర్తి. ప్రస్తుతం రైల్వేలో సూపరింటెండెంట్‌గా ఉద్యోగం చేస్తున్నా. గతంలోనూ రైల్వే క్లర్క్ ఉద్యోగం వచ్చింది.

30న సామూహిక గృహ ప్రవేశాలు

- కలెక్టర్ అరుణ్‌బాబు



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా నిర్మిస్తున్న గృహాలను ఆగస్టు 30న సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం హౌసింగ్, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, రీ సర్వే, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర కేఎస్ జవహర్‌రెడ్డి అమరావతి నుంచి వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డితో కలెక్టర్ మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలు చేపడతామన్నారు. ఈ ఏడాది రాగి సాగు విస్తీర్ణం 25 వేల హెక్టార్లలో చేపడతామని వివరించారు. వీసీ అనంతరం పుట్టపర్తి కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి పలు ఆదేశాలు ఇచ్చారు. 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ మిల్లెట్స్ ఏడాదిగా ప్రకటించడంతో రాగులు, కొర్ర, జొన్న తదితరాలను పండించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో లక్ష్యం మేర పూర్తయిన జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు, స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు గడువులోగా పూర్తి చేయాలన్నారు. స్పందన అర్జీలు, జగనన్నకు చెబుదాం అర్జీలకు సకాలంలో సంతృప్తి మేర పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్య, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, పీఆర్ ఎస్‌ఈ గోపాల్ రెడ్డి, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు, సీపీఓ విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, పశు సంవర్ధక శాఖ అధికారి శుభదాస్, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజుల్లో ముగియనున్న ఇంటింటి సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి అర్బన్: ఓటరు జాబితా సవరణలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వే కార్యక్రమం మరో నాలుగు రోజుల్లో ముగియనుందని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. జీరో డోర్ నంబర్లు, ఒకే డోర్ నంబర్‌లో ఎక్కువ మంది ఓటర్లు ఉన్నా, వంద సంవత్సరాలు పైబడి వయస్సున్న ఓటర్ల సవరణలు, తదితరాలను బీఎల్‌ఓ యాప్‌తో పాటు రిజిస్టర్లలో నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు నవీన్‌కుమార్, వెంకటరెడ్డి, దేవేంద్రనాయక్, డివిజనల్ అధికారి జిలాని, ఎన్నికల డీటీ నరసింహులు, హరి, కృష్ణ, రహమాన్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, సీపీఐ, సీపీఐ, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'ఫిష్ ఆంధ్ర-ఫిట్ ఆంధ్ర'తో ఉపాధి

- డీఆర్‌డీఏ పీడీ నరసయ్య



మాట్లాడుతున్న నరసయ్య

పరిగి: దేశంలోనే మన రాష్ట్రానికి చేపల ఎగుమతిలో మంచి పేరుందని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య తెలిపారు. గురువారం ఆయన పరిగి మండలానికి విచ్చేశారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో వివిధ మండలాల లబ్ధిదారులతో 'ఫిష్ ఆంధ్ర-ఫిట్ ఆంధ్ర' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. దేశంలో చేపల ఎగుమతిలో మన రాష్ట్రం ప్రముఖ పాత్ర వహిస్తోందన్నారు. అయితే ఇక్కడి ప్రజలకు అన్ని విధాలా ఆరోగ్యకరమైన చేపలను ఆహారంగా పొందలేకపోతున్నారన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం 'ఫిష్ ఆంధ్ర-ఫిట్ ఆంధ్ర' కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. స్థానికంగా దొరికే చేపలు స్థానిక ప్రజల అవసరాలకే వినియోగించుకోవాలన్నదే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. దీని కోసం ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోందన్నారు. ప్రతి మండలంలోనూ 5 యూనిట్ల స్థాపనకు ప్రభుత్వం రాయితీని ప్రకటించిందని తెలిపారు. మహిళలకు ప్రత్యేకంగా 95 శాతం సబ్సిడీని అందించి, ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటునందిస్తోందన్నారు. 'ఫిష్ ఆంధ్ర – ఫిట్ ఆంధ్ర' పై గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి, ఆర్థికంగా బలోపేతానికి క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫిషరీస్ డీడీ చంద్రశేఖర్‌రెడ్డి, ఏరియా కోఆర్డినేటర్ రామిరెడ్డి, ఏపీఎం దేవానంద్ ఫిలిప్సన్, వివిధ మండలాల నుంచి వచ్చిన లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

- 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష' లక్ష్యమిదే
- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ కోటేశ్వర రావు



మాట్లాడుతున్న కోటేశ్వర రావు




హాజరైన అధికారులు, సచివాలయ ఉద్యోగులు

అనంతపురం క్రైం: చాలా ఏళ్లుగా నెలకొన్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష'కు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ కోటేశ్వర రావు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని సచివాలయాల అడ్మిన్, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ కార్యదర్శులకు గురువారం నగర శివారులోని ఓ ఫంక్షన్ హాల్లో రీ సర్వేపై వర్క్‌షాపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో డ్రోన్ సర్వే పూర్తయిందన్నారు. ప్రతి స్థలానికి వచ్చే ఏడాది మార్చిలోపు భూ హక్కు పత్రాన్ని అందిస్తామన్నారు. వందేళ్ల తర్వాత చేపట్టనున్న రీ సర్వేను విజయవంతం చేసేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 96 యూఎల్‌బీలలో డ్రోన్ ఫ్లై ప్రక్రియ పూర్తవగా, 56 యూఎల్‌బీలకు మ్యాప్‌లు కూడా వచ్చాయని వెల్లడించారు. ఇటీవల వర్షాల కారణంగా డ్రోన్ సర్వేకు కొంత అంతరాయం కల్గిందని పేర్కొన్నారు. అనంతరం 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష' పథకంలోని 23 అంశాలపై స్పెషలాఫీసర్ సుబ్బారావుతో కలిసి ఆయన అవగాహన కల్పించారు. పురోగతి సాధించడానికి తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. స్థల యజమానికి, ప్రభుత్వ స్థలాలకు సంబంధించి ఫాం 14 నోటీసు తప్పక అందజేయాలని ఆదేశించారు. సర్వే కచ్చితంగా చేయాల్సిందేనని, ఇందులో ఎవరూ తప్పించుకునేందుకు ఆస్కారం ఉండదన్నారు. అంకితభావంతో పని చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ రానున్న రోజుల్లో రీ సర్వేను మరింత వేగవంతం చేయాలన్నారు. అర్బన్ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా రికార్డులను చూసుకుని క్షేత్రస్థాయిలో నిజనిర్ధారణ చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి, నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, వివిధ మున్సిపాలిటీల కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్యాంకర్ చోరీ



అపహరించుకెళ్లిన ట్యాంకర్ (ఫైల్)

రొళ్ల: మండలంలోని వన్నారనపల్లికి చెందిన రాజ్‌కుమార్ వాటర్ ట్యాంకర్‌ను బుధవారం రాత్రి దొంగలు అపహరించుకెళ్లారు. పట్టణ శివారున అగళికి వెళ్లే జాతీయ రహదారి సర్కిల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న హోటల్ వద్ద నీళ్లతో నింపి ఉంచిన ట్యాంకర్‌ను బుధవారం రాత్రి ఉంచి ఇంటికెళ్లారు. ఉదయాన్నే అక్కడకు చేరుకుని చూడగా రూ.1.40 లక్షల విలువైన ట్యాంకర్ కనిపించలేదు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ధర్మవరం అర్బన్: పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్ట్ చేసి, రూ.3,50,790 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ధర్మవరం టూటౌన్ సీఐ రాజా తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక చంద్రబాబునగర్ శివారు ప్రాంతంలోని కంపచెట్ల మధ్యలో కొందరు పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారన్నారు. పోలీసుల రాకను గమనించిన ముగ్గురు అక్కడి నుంచి పారిపోగా 11 మంది పట్టుబడ్డారన్నారు. జూదరులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రామగిరి: కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న 50 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని గురువారం స్వాధీనం చేసుకున్నట్లు రామగిరి ఎస్‌ఐ జనార్ధననాయుడు తెలిపారు. ధర్మవరానికి చెందిన రాజేంద్రప్రసాద్, అనంతపురం రూరల్ నివాసి మహేష్‌నాయక్ ఉమ్మడిగా బొలెరో వాహనంలో బియ్యం తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. వాహనాన్ని సీజ్ చేసి, నిందితులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే రామగిరి మండలం పెద్ద కొండాపురం వద్ద కర్ణాటక మద్యం తరలిస్తూ బొమ్మయ్య అనే వ్యక్తి పట్టుబడ్డాడన్నారు. నిందితుడి నుంచి 98 కర్ణాటక మద్యం బాటిళ్లను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

విదేశీ విద్యకు మార్గం సుగమం

- జేఎన్‌టీయూ(ఏ)లో చేరితే స్వీడన్‌లో చదువుకోవచ్చు
- డ్యూయల్ డిగ్రీ విధానంపై బ్లెకింగ్ వర్సిటీతో ఒప్పందం



జేఎన్‌టీయూ పాలక భవనం

అనంతపురం: డాలర్ డ్రీమ్ ఇప్పటి యువత కల. ఇందు కోసం విదేశాల్లో ఉన్నత చదువులు చదివి అక్కడే స్థిరపడాలని భావిస్తోంది. ఈ కలను సాకారం చేసుకోవాలంటే పొరుగు దేశం వెళ్లి ఏదైనా కోర్సు చేయాలి. లేదా ఆ దేశం నుంచి వీసా పొందాలి. ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవాలి. ఇలాంటి వ్యయ ప్రయాసలకు చెక్ పెట్టి విదేశాల్లో ఎంఎస్ పూర్తి చేసే కలను జేఎన్‌టీయూ(ఏ) సాకారం చేస్తోంది. ఇప్పటికే స్వీడన్‌లోని బ్లెకింగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకుని పలు కోర్సుల్లో నాలుగేళ్ల డిగ్రీకి అవకాశం కల్పిస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా స్వీడన్ బ్లెకింగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో సీఎస్‌ఈ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, ఈసీఈ విభాగాల్లో సీట్లు భర్తీ చేస్తోంది.

ఈ ఏడాది 12 అడ్మిషన్లు..

జేఎన్‌టీయూ (ఏ), బ్లెకింగ్ వర్సిటీ సంయుక్తంగా అందిస్తున్న ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో 2023–24 విద్యా సంవత్సరానికి 12 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ కంప్యూటర్ సైన్సెస్‌లో 10 మంది, ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , మెషిన్ లర్నింగ్‌లో ఇద్దరు అడ్మిషన్లు పొందారు. బీటెక్ కోర్సులో మూడు సంవత్సరాలు జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్‌లోనూ, చివరి సంవత్సరం స్వీడన్‌లో పూర్తి చేయాల్సి ఉంటుంది. కోర్సు పూర్తి కాగానే డిగ్రీని జేఎన్‌టీయూ(ఏ) ప్రదానం చేస్తుంది. బీఎస్ పట్టాను బ్లెకింగ్ వర్సిటీ (స్వీడన్) అందిస్తుంది.

ఫీజులు అందుబాటులోనే..

ఇంటిగ్రేటెడ్ కోర్సులకు సంబంధించి ఫీజులు కూడా అందుబాటులో ఉండడం గమనార్హం. జేఎన్‌టీయూ(ఏ)కు ఏడాదికి రూ.1.50 లక్షలు, స్వీడన్‌లో ఏడాదికి రూ.7 లక్షల వరకు ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ఏపీ ఈఏపీసెట్ లేదా జేఈఈలో అర్హత సాధించిన వారు అర్హులు. ఇంటర్మీడియట్ ఎంపీసీలో కనీసం 60 శాతం మార్కుల ఉత్తీర్ణత పొంది ఉండాలి.

డ్యూయల్ డిగ్రీ విధానం నచ్చింది



జేఎన్‌టీయూ (ఏ), బీటీహెచ్ సంయుక్తంగా అందిస్తున్న డ్యూయల్ డిగ్రీ విధానం నచ్చింది. దీంతో అడ్మిషన్ తీసుకున్నా. స్వీడన్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారికి విస్తృత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రోగ్రాం బాగా దోహదం చేస్తుందని భావిస్తున్నా.

– గాయత్రి, బీటెక్ విద్యార్థి, జేఎన్‌టీయూ (ఏ)

ఫీజులో రాయితీ



సొంతంగా విదేశాల్లో ఎంఎస్ చేయాలంటే చాలా కష్టం. మనమే నేరుగా వర్సిటీలను ఎంపిక చేసుకోవాలి. వర్సిటీ తరఫున వెళితే ఫీజులో రాయితీ బాగా కలిసోస్తుంది. బీటెక్ కోర్సులో మూడేళ్లు పూర్తిగా జేఎన్‌టీయూ (ఏ)లోనే చదువుతాం. చివరి ఏడాది స్వీడన్‌కు వెళుతాం.

– గ్రీష్మ, బీటెక్ విద్యార్థి, జేఎన్‌టీయూ(ఏ)

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



డ్యూయల్ డిగ్రీ విధానంతో విదేశీ వర్సిటీల్లోని బోధన, పరిశోధనలను ఇచ్చి పుచ్చుకునేందుకు వీలు కలుగుతోంది. ఒప్పందం మేరకు విదేశీ వర్సిటీనే మన విద్యార్థులకు పూర్తి సహకారం అందిస్తాయి. అంతర్జాతీయ నైపుణ్యాలు పెంపొందించడానికి ఈ తరహా బ్రాంచ్‌లు అమలులోకి తీసుకువచ్చాం. – ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, వీసీ

ఐచర్ బోల్తా - యువకుడి దుర్మరణం

- 17 మంది కూలీలకు తీవ్రగాయాలు.
- ఇద్దరి పరిస్థితి విషమం



మృతుడు హోరిల్ యాదవ్



నుజ్జునుజ్జైన మినీ ఐచర్

నల్లచెరువు: మినీ ఐచర్ బోల్తాపడిన ఘటనలో బీహార్‌కు చెందిన యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మరో 17 మంది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... వైఎస్సార్ జిల్లా కడప నుంచి నల్లచెరువులోని ఓ మిల్లుకు వేపగింజల సంచుల లోడుతో మినీ ఐచర్ బయలుదేరింది. గురువారం తెల్లవారుజామున 4 గంటలకు అల్లుగుండు సమీపంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్దకు చేరుకోగానే మదనపల్లి నుంచి కదిరి వైపు వేగంగా వెళుతున్న లారీ ఢీ కొంది. ఘటనలో మినీ ఐచర్ బోల్తాపడింది. వాహనం ముందు భాగం నుజ్జునుజ్జైంది. ప్రమాదంలో ఐచర్ వాహనంలో ఉన్న బీహార్‌కు చెందిన కూలీ హోరిల్ యాదవ్ (24) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో 17 మంది కూలీలు గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సహాయక చర్యలు చేపట్టి 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో రాజేష్ యాదవ్, నగేంద్రషా పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూలు సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వరలక్ష్మి తెలిపారు.

ఆర్‌ఎంపీ వ్యవహారంపై సమగ్ర విచారణ



దూషిస్తున్న టీడీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డిని వారిస్తున్న వైద్యాధికారి రామకృష్ణ

చిలమత్తూరు: ఆర్‌ఎంపీ వేసిన సూది మందు వికటించి రోగి పరిస్థితి విషమంగా మారిన అంశంపై జిల్లా వైద్యాధికారి డాక్టర్ కృష్ణారెడ్డి సమగ్ర విచారణకు ఆదేశించారు. 'వికటించిన ఆర్‌ఎంపీ వైద్యం' శీర్షికన గురువారం 'సాక్షి'లో వెలువడిన కథనం విదితమే. దీనిపై డీఎంహెచ్‌ఓ స్పందించి, సమగ్ర విచారణ చేపట్టి నివేదికను అందజేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రామకృష్ణను ఆదేశించారు. దీంతో రంగంలో దిగిన డాక్టర్ రామకృష్ణ గురువారం ఉదయం ఆర్‌ఎంపీ వెంకటేశ్వర్లు క్లినిక్‌ను పరిశీలించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేత శ్రీనివాసరెడ్డి తదితరులు అక్కడకు చేరుకుని విచారణ ప్రకియను అడ్డుకునే ప్రయత్నం చేశారు. వైద్యాధికారి విధులకు ఆటంకం కలిగిస్తూ దూషణలకు దిగారు. వారించబోయిన డాక్టర్ రామకృష్ణపై దాడికి యత్నించారు. దీంతో డాక్టర్ రామకృష్ణ నేరుగా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు పోలీస్ స్టేషన్‌కెళ్లి పోలీసుల సమక్షంలోనే డాక్టర్ రామకృష్ణను బెదిరించారు. కేసు పెడితే ఆస్పత్రి ఎదుట ధర్నా చేపడతామని, ఎవరొచ్చినా తమనేమీ చేయలేరంటూ హెచ్చరించారు. మొత్తం వ్యవహారంపై డీఎంహెచ్‌ఓకు డాక్టర్ రామకృష్ణ నివేదిక అందజేశారు. అనంతరం డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు ఆర్‌ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేశారు. కాగా, బెంగళూరులో చికిత్స పొందుతున్న రవనకుల్లా ఆరోగ్యం కాస్త మెరుగు పడినట్లు సమాచారం.

బకాయి వసూలుకు బంధించారు

- గుంటూరు మురగన్ సిల్క్సషాపు గుమస్తాను బంధించిన పట్టుచీరల వ్యాపారస్తుల సంఘం
- త్వరలో బకాయి చెల్లిస్తామన్న హామీతో విడుదల



గుమస్తా శ్రీకాంత్‌ను ప్రశ్నిస్తున్న పట్టుచీరల తయారీ వ్యాపారుల సంఘం నాయకులు

ధర్మవరం: సిల్క్స్ షాపుల యజమానులు బకాయి పడ్డ మొత్తాన్ని చెల్లించకుండా ఇబ్బందులు పెడుతుండటంతో ధర్మవరం పట్టుచీరల వ్యాపారుల సంఘం నాయకులు చర్యలకు దిగారు. నెల రోజుల క్రితం ధర్మవరం పట్టుచీరల వ్యాపారులపై విజయవాడలో 'ఆలయ సిల్క్స్' యజమాని అవినాష్‌గుప్త దాడిచేసిన విషయం తెలిసిందే. దీంతో పట్టుచీరల వ్యాపారులు అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని వివిధ ప్రాంతాల్లోని సిల్క్స్ దుకాణ దారుల నుంచి బకాయిలను చట్ట ప్రకారం వసూలు చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా దాదాపు రూ.1.50 కోట్ల బకాయి ఉన్న గుంటూరుకు చెందిన కాంచీపురం మురగన్ సిల్క్సషాపు గుమస్తా శ్రీకాంత్ గురువారం ధర్మవరంలో కనిపించడంతో వ్యాపారులు అతన్ని పట్టణంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో బంధించారు. తమ బకాయి మొత్తం చెల్లించే వరకూ వదిలేది లేదని తేల్చిచెప్పారు. బకాయి మొత్తం చెల్లించకుండా గుమస్తా శ్రీకాంత్ ధర్మవరానికి పట్టుచీరల కోసం రావడంపై నిలదీశారు. యజమాని వంశీవర్మతో ఫోన్‌లో మాట్లాడారు. 15 రోజుల్లో బకాయి చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో శ్రీకాంత్‌ను వదిలేశారు.

ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జేడీ పద్మమ్మ

పుట్టపర్తి టౌన్: పట్టు రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సెరికల్చర్ జేడీ పద్మమ్మ పేర్కొన్నారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో బీడుపల్లి రైతు భరోసా కేంద్రంలో పట్టుబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అవుటాల రమణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 40 వేల ఎకరాల మల్బరీ తోటలు సాగు చేస్తున్నారన్నారు. ఇంకా సాగు పెంచేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందన్నారు. సంవత్సరానికి 10 పంటలు తీసుకోవచ్చన్నారు. మల్బరీ తోటలు పెంచే రైతులకు రూ.18,750 చొప్పున గరిష్టంగా 5 ఎకరాల వరకు అందజేస్తారని చెప్పారు. షెడ్డు నిర్మాణానికి రూ.3 లక్షలు, స్టాండ్ ఇతర ఖర్చులకు రూ.52 వేల వరకూ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో సెరికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ సుమ, ఆర్‌బీకే సిబ్బంది లక్ష్మితో రైతులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

గుంతకల్లు: తల్లి మందలింపుతో మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. గుంతకల్లులోని రాజేంద్ర నగర్‌లో నివాసముంటున్న ఈడిగ జయమ్మకు ఇద్దరు కుమార్తెలున్నారు. స్టేషన్ రోడ్డులో ఓ చిరు దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమార్తెకు వివాహమైంది. పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న రెండో కుమార్తె దివ్యశ్రీ (23) మూడు రోజులుగా ఇంటి పట్టునే ఉంటోంది. దీంతో బుధవారం ఉదయం తల్లి మందలించి, దుకాణానికి వెళ్లింది. రాత్రి ఇంటికి చేరుకుని చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని విగతజీవిగా వేలాడుతున్న దివ్యశ్రీని చూసి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు సీఐ గణేష్ తెలిపారు.

వైభవంగా తైలాభిషేకాలు



శనీశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆర్చ్

పావగడ: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని పావగడలోని శనీశ్వరాలయంలో గురువారం తైలాభిషేక పూజలు వైభవంగా జరిగాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తులు 'శం శనైశ్చరాయ నమః' అంటూ స్వామి నామస్మరణ చేస్తుండగా ప్రధాన అర్చకుడు కృష్ణ శాస్త్రి పూజాదికాలు నిర్వహించారు. శని దోష నివారణ పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన అగ్ని గుండంలోకి తొమ్మిది నల్ల వత్తులు సమర్పించి ఆలయం చుట్టూ తొమ్మిది సార్లు ప్రదక్షిణలు చేశారు. తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శీతలాంభదేవికి విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. అన్నదాసోహ భవనంలో స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ సమితి అధ్యక్షుడు ఆనందరావు, పదాధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలందించారు. కాగా, స్వామి దర్శనానికి మంగళూరు నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదుపై ఆర్డీఓ విచారణ

గోరంట్ల: రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయినా తనకు బీమా పరిహారం మంజూరు చేయలేదంటూ మానవ హక్కుల సంఘానికి అందిన ఫిర్యాదుపై ఆర్డీఓ విచారణ చేపట్టారు. వివరాలు.. గోరంట్ల మండలం గుమ్మయ్యగారిపల్లికి చెందిన కంసల అశోక్‌కుమార్ తల్లిదండ్రులు నాలుగు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీనిపై పోలీసు కేసు కూడా నమోదైంది. అన్ని దాఖలాలను జత చేస్తూ వైఎస్సార్ బీమా పథకం కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరు కాలేదు. దీంతో హెచ్‌ఆర్‌సీకి అశోక్‌కుమార్ ఫిర్యాదు చేశారు. దీనిపై కమిషన్ ఆదేశాల మేరకు గురువారం ఉదయం గోరంట్ల తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ భాగ్యరేఖ విచారణ చేపట్టారు. అశోక్‌కుమార్ తల్లిదండ్రులు జీవించి ఉన్నప్పుడు వైఎస్సార్ బీమా పథకానికి నమోదు చేసుకోలేదని, దీంతో బీమా వర్తింపజేయడం సాధ్యం కాలేదంటూ ఎంపీడీఓ రఘునాథ గుప్త వివరించారు. దీంతో అశోక్‌కుమార్‌తో ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు బీమా పథకానికి నమోదు చేసుకోకపోతే పరిహారం వర్తించదన్నారు. అయితే స్థానిక ఎమ్మెల్యే ఎం.శంకరనారాయణతో చర్చించి బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సాయం అందేలా చేస్తామన్నారు. ప్రధానమంత్రి సురక్ష పథకం వర్తింపజేస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ బాబు, తహసీల్దార్ రంగనాయకులు, మల్లాపల్లి సర్పంచ్ శివానంద పాల్గొన్నారు.

నేడు ఎస్కేయూలో వాక్ఇన్ ఇంటర్వ్యూలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అకడమిక్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి శుక్రవారం వాక్ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కృష్ణకుమారి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. విభాగాల వారీగా నిర్దేశించిన సమయాల్లో ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు.

ఇంటర్వ్యూలు ఆయా విభాగాల్లోనే నిర్వహిస్తారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు నేరుగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలి. పీహెచ్‌డీ పూర్తి చేసి ఉండాలి. లేదా నెట్/సెట్ అర్హత సాధించి ఉండాలి.

18వ తేదీ ఇంటర్వ్యూల షెడ్యూల్ ఇలా..	
సమయం	విభాగం
ఉదయం 10 నుంచి 11 గంటలు	బయోకెమిస్ట్రీ, కెమిస్ట్రీ, సోషియాలజీ
ఉదయం 11 నుంచి 12 గంటలు	సెరికల్చర్, రూరల్‌డెవలప్‌మెంట్/ఎంఎస్‌డబ్ల్యూ, హిస్టరీ
మధ్యాహ్నం 12 నుంచి 1 గంట	కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్
మధ్యాహ్నం 2 నుంచి 3 గంట	స్టాటిస్టిక్స్, పొలిటికల్ సైన్సెస్
మధ్యాహ్నం 3 నుంచి 4 గంట	మైక్రోబయాలజీ, తెలుగు
సాయంత్రం 4 నుంచి 5 గంట	మేథమేటిక్స్, అడల్ట్ ఎడ్యుకేషన్

19వ తేదీ ఇంటర్వ్యూల షెడ్యూల్ ఇలా..	
సమయం	విభాగం
ఉదయం 10 నుంచి 11 గంటలు	పాలీమర్ సైన్స్, కామర్స్
ఉదయం 11 నుంచి 12 గంటలు	ఎంబీఏ, ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్
మధ్యాహ్నం 12 నుంచి 1 గంట	జియోగ్రఫీ, లా
మధ్యాహ్నం 2 నుంచి 3 గంట	జువాలజీ, హిందీ
మధ్యాహ్నం 3 నుంచి 4 గంట	బోటనీ, ఇన్‌స్ట్రుమెంటేషన్
సాయంత్రం 4 నుంచి 5 గంట	ఇంగ్లిష్, ఫిజికల్ ఎడ్యుకేషన్

గ్రంథాలయ సెస్‌ను పూర్తి స్థాయిలో వసూలు చేయండి

- జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ



మడకశిర గ్రంథాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న రమ

మడకశిర/పెనుకొండ/గుడిబండ: గ్రంథాలయ సెస్‌ను పూర్తి స్థాయిలో వసూలు చేయాలని గ్రంథాలయాధికారులకు ఆ సంస్థ కార్యదర్శి రమ సూచించారు. గురువారం ఆమె మడకశిర, పెనుకొండ, గుడిబండలోని గ్రంథాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పాఠకుల సభ్యత్వాన్ని పెంచాలని మడకశిర, పెనుకొండ, గుడిబండ గ్రంథాలయాధికారులు శ్రీనివాసులు, మహబూబ్‌బాషా, కమలనాభరావును ఆదేశించారు. సెస్ వసూలులో నిర్లక్ష్యం వీడాలన్నారు. అనంతరం పాఠకులతో మాట్లాడుతూ.. గ్రంథాలయంలో సౌకర్యాలు, పుస్తకాలు, ఇతర అవసరాలను అడిగి తెలుసుకున్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి : డీఆర్‌ఎం



సిబ్బందికి సూచనలిస్తున్న డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్

గుంతకల్లు: విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉన్నప్పుడే ప్రమాదాలు నివారించగలుగుతామని రైల్వే ఉద్యోగులకు డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ సూచించారు. గుంతకల్లు డివిజనల్‌లోని నంద్యాల–బేతంచెర్ల–డోన్ సెక్షన్లలోని రైలు మార్గంతో పాటు రైల్వేస్టేషన్లు గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సేఫ్టీ విభాగం సిబ్బందికి పలు సూచనలిచ్చారు. భద్రత విభాగంలో స్టేషన్ మాస్టర్లు, పాయింట్స్‌మెన్లు, గ్యాంగ్‌మెన్లు కీలకమన్నారు. సిగ్నల్ పాయింట్ వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది అలసత్వ వహించరాదన్నారు. తరుచూ పాయింట్లను చెక్ చేస్తుండాలన్నారు. సాయంత్రం డోన్ రైల్వే జంక్షన్ ఇంజనీరింగ్ స్టాఫ్‌తో సేఫ్టీ సెమినార్ నిర్వహించారు. భద్రత పరమైన విషయంలో రాజీ లేకుండా పనిచేయాలని సూచించారు.

మార్గదర్శి కార్యాలయాల్లో సోదాలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక బళ్లారి చౌరస్తాలోని మార్గదర్శి కార్యాలయంలో గురువారం సీబీ సీఐడీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, విజిలెన్స్, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. డిపాజిట్లను బదిలీ చేశారన్న ఆరోపణల నేపథ్యంలో మార్గదర్శి కార్యాలయాల్లో సోదాలు జరుగుతున్న విషయం పాఠకులకు తెలిసిందే. ఇప్పటి వరకూ అనంతపురం మార్గదర్శి కార్యాలయంలో మూడవ సారి అధికారుల బృందం సోదాలు చేపట్టింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సోదాలు రాత్రి వరకూ కొనసాగాయి. కొన్ని కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు.

నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం

- సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు



పట్టాను ప్రదానం చేస్తున్న రత్నాకర్‌రాజు

ప్రశాంతి నిలయం: రోగులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ కృషి చేస్తోందని ఆ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు పేర్కొన్నారు. వైట్‌ఫీల్డ్‌లోని సత్యసాయి నర్సింగ్ కళాశాలలో 9, 10వ బ్యాచ్ విద్యార్థుల స్నాతకోత్సవం గురువారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రత్నాకర్‌రాజు హాజరయ్యారు. బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందజేసి, ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం స్విమ్స్‌లో రూ.4.4 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన న్యూరో సర్జరీ మైక్రోస్కోప్, రూ.1.5కోట్లతో ఏర్పాటు చేసిన క్యాథ్‌ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నాకర్ రాజు మాట్లాడారు. సత్యసాయి ఆశయ సాధనకు ట్రస్ట్ నిరంతర సేవలు కొనసాగిస్తున్నారు. సిమ్స్ వైట్‌ఫీల్డ్ డైరెక్టర్ డాక్టర్ సుందరేశన్, విద్యార్థులు పాల్గొన్నారు.



శనీశ్వరస్వామి